# వారసత్వం

'వాణిశ్రీ'

గూళ్ళకు చేరుకుంటున్న పక్షుల కిల కిలా రవాలు, ఇళ్ళకు మళ్ళిన ఎద్దుల మెడల్లోని చిరుగంటల మోత, పాలేర్ల అదిలింపులూ వింటూ కూర్చుంది అన్నపూర్ణ.

"ఎన్నాళ్ళు సాగించుకుంటాడని చూస్తూ వూరుకుంటే నువ్వూ, నీ పిల్లలూ అడుక్కు తినాలి! ఇలా పెడదారిన పోయిన వాళ్ళెవరూ బాగుపడగా నేను వినలేదు" అన్నాడు సీతయ్య కోపంగా.

సీతయ్య మాటలు విని మట్టిబొమ్మలా మాటా పలుకూ లేకుండా కూర్చుండి పోయింది ఆమె.

"అనిల్ రేపు వస్తాడా?" సీతయ్యే అన్నాడు.

"వచ్చేస్తాడు. పరీక్షలు ఈ రోజు అయిపోతాయని జాబు రాశాడు" అం


"సరే అయితే. వాడొచ్చాక కబు పెట్టు. నే వెళ్తా. చీకటి పడుతోంది. అంటూ లేచాడు సీతయ్య.

"ఇంతలోకే వెళ్ళడం ఎం కన్నయ్యా! రేపు వాడు వస్తాడుగా. అంది.

"కాదులే, రేపు మిరపతోటకి మం కొట్టించాలి. దగ్గరుంటేగాని కుదర నా మాట విని ఇక వాడి చదు మాన్పించు."

క్షణంసేపు భయంగా సీతయ్య క లోకి చూసింది అన్నపూర్ణ.

"మధ్యలోనా?" అంది నెమ్మదిగా.



'ఏం అయితే ఈ ఏటితో అయ్యేదా? పెట్టేదా? ఇంకా మూడేళ్లు చదివితేగాని బి ఏ పూర్తిగాదు ఈలోపలే అంతా మునిగిపోవడం ఖాయం" పొగాకు కాడతో చుట్ట చుట్టుకుంటూ అన్నాడు సీతయ్య

ఇక్కడవుండి వాడేం చేస్తాడు?'

ఆమె మనసులో అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నా సీతయ్యతో నెమ్మదిగా అంది

'ఏంచేసినా వాడితోనే చేయించాలి లేకపోతే ఏమీ దక్కదు నువ్వు వూరుకో నేను చెప్పినట్లు విను అన్ని ఏర్పాట్లూ నేను చేస్తాగా!


సీతయ్య మాటల్లోని నిగూఢార్థం ఆమెకు అర్థమైంది

కాని అందరూ ఏమనుకుంటారో బెరుకుగా అంది

"ఎవరమ్మా ఆ అందరూ? అనుకుంటే అనుకోనీ. నీ సంసారం నాశనమైపోతూ వుంటే ఎవరైనా ఆదుకుంటున్నారా? రేపెవరైనా ఒకపూట అన్నం పెడతారా? ఈ లోకంలో అందరూ స్వార్థపరులే. ఎవరైనా పాడైపోతూవుంటే లోలోపల సంతోషించి పైకి విచారం నటిస్తారు. ఒకళ్ళేమనుకుంటారో ననుకుంటే మనం ఏమీ చేయలేం" తీవ్రంగా అన్నాడు సీతయ్య.

గోదావరి వరదలా ఉప్పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోవడానికి చేత్తో నోరు నొక్కుకుంది ఆమె.

కాళ్ళకేదో బంధం పడినవాడిలా ఆగి పోయాడు సీతయ్య. చెల్లెలి ఏడుపు అతన్ని కదలనివ్వలేదు



"ఊరుకో అమ్మా! ఏంచేస్తాం? వాడి జన్మ అలా రాసిపెట్టివుంది...." అన్నాడు. సీతయ్య కంఠంలో ఆత్మీయత వెల్లి విరిసింది.

"చివరకు నా బ్రతుకు వీధిలోపడింది అన్నయ్యా!..." ఏడుస్తూ అన్నది ఆమె.

చెల్లెలి మాటల్లోని ఆవేదన, ఆక్రోశం సీతయ్య గుండెల్ని కదిలించింది. భరించ లేని వాడిలా గబ, గబా అడుగులు వేసు కుంటూ వెళ్ళిపోయాడు.

కొంగుతో కళ్లు తుడుచుకుని వెళ్ళి పోతున్న సీతయ్యను చూస్తూ వీధి

గుమ్మంలో నిల్చుంది అతను కను చూపుకు అందనంతదూరం వెళ్ళిపోగానే ఆమె శూన్యంలోకి చూస్తూ శిలలా వుండి పోయింది.

'ఏంచేసినా వాడితోనే చేయించాలి' సీతయ్య మాటలు చెవులో మారు మ్రోగు తున్నాయి.

సీతయ్య మాటలు ఆమెలో ఒక ఆశా జ్యోతిని వెలిగించాయి. నిరాశ అనే అంధకారంలో అనిల్ మినుకు మినుకు మంటూ ఒక కాంతి కిరణంలా కన్పిం చాడు.

ఆమె దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడి చింది. సీతయ్య రాకముందు గుమ్మడి కాయలా కనిపించిన సమస్య క్షణంలో గురివింద గింజంత చిన్నదై పోయినట్లని పించింది.

*　　*　　*

అప్పుడే తలంటు స్నానంచేసి బట్టలు కట్టుకుంటున్న అనిల్‌కి సీతయ్య మాటలు వినిపించాయి. సంతోషంతో అతని హృదయం పొంగిపోయింది. చిన్నప్పటి నుంచి మావయ్యంటే ఎంతో ఆపేక్ష వాడికి.

"మావయ్యా! ఎప్పుడొచ్చావ్?" అన్నాడు వస్తూనే.

పడక్కుర్చీలో కూర్చుని చుట్ట కాల్చు కుంటున్న సీతయ్య మేనల్లుడిని చూసి చిరునవ్వు నవ్వి "ఇప్పుడే" అన్నాడు.

వేడి. వేడిగా వున్న గారెలు పళ్ళెం నిండా తెచ్చి సీతయ్య చేతికిచ్చింది అన్నపూర్ణ.

"అత్తయ్య బాగుందా? సుబ్బులు బడికి వెళ్తోందా? సీనుగాడు బాగా అల్లరి చేస్తున్నాడా? అంటూ ప్రశ్నలవర్షం కురిపించాడు అనిల్

"అంతా బాగానే వున్నారు. నిన్నొక సారి తీసుకురమ్మందిరా మీ అత్తయ్య. పద. నాలుగురోజులు వుండి వద్దువు గాని " అన్నాడు సీతయ్య.

అన్నపూర్ణ వంట గదిలోనుంచి వచ్చి కొడుకు చేతికి గారెల పళ్ళెం ఇచ్చింది.

"ఈ రోజు గూడా బావ రాలేదా?" అన్నాడు సీతయ్య చెల్లెల్ని వుద్దేశించి.

అన్నపూర్ణ ముఖంలో కారు మబ్బులు తొంగిచూశాయి. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతూ వుంటే చెంగుతో కళ్ళు తుడుచుకుని సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయింది.

"చూశావురా అనిల్. సంక్రాంతి పండగ గదా. ఈ రోజుగూడా మీ నాన్న ఇంటికి రాలేదు. అది రానివ్వలేదేమో?" అన్నాడు సీతయ్య.

అనిల్ మావయ్య ముఖంలోకి ఒక్క సారి చూసి తల దించుకున్నాడు. ఏం మాట్లాడాలో అతనికి అర్థంకాలేదు.

"పరిస్థితుల్ని అర్థంచేసుకునే శక్తి మీ నాన్నకు లేదిప్పుడు. వాడి మెదడులో బంకమన్ను పేరుకుపోయిందిరా. చూశా వుగా మీ అమ్మ కుమిలి, కుమిలి కృశించి పోతూవుంది. నువ్వే ఏదో మార్గం చూడాలి." అన్నాడు సీతయ్య.

"నేనేం చెయ్యను మావయ్యా?" విచారంగా అన్నాడు అనిల్.

"నేను చెప్పినట్లు చేస్తే చాలు."

"చెప్పు."

"ముందు చదువు మానెయ్యాలి నువ్వు. కావాలంటే తర్వాత మళ్ళీ ఎప్పు డైనా చదువుకోవచ్చు."

"ఆఁ ." అన్నాడు అనిల్.

ఆశ్చర్యం వాడి కళ్ళల్లో ప్రతిఫలించింది.

"ఎందుకూ?" అన్నాడు తర్వాత.

"పరిస్థితులు బాగా లేవురా. ఇప్పటికే పూళ్ళో పాతికవేల దాకా అప్పులు చేశాడు మీ నాన్న. దానిమీద వడ్డీ పాపంలా పెరిగిపోతోంది రైస్మిల్లు బాగానే నడుస్తున్నా, దానిమీద వచ్చే ఆదాయం చాలటంలేదు మీ నాన్నకు. నలుగుర్నీ పోగేసుకుని తాగి, తందనాలాడుతున్నాడు. ఆ మీనాక్షి నగలకనీ, చీరలకనీ దోచిపెడుతున్నాడు. ఇరవై నాలుగు గంటలూ దాని కొంపలోనే మకాం. రైస్మిల్లు మేనేజర్ రామాచారి అద్దూ, అపూ లేకుండా దిగమింగుతూ బాగుపడిపోతున్నాడు. మొన్నీ మధ్య ఇంటికివచ్చి మీ అమ్మ పేరుతోవున్న పొలం అమ్మేసెయ్యమనీ, నగలు ఇవ్వమనీ గొడవ చేశాడట. మీ అమ్మ నాకు కబురుచేసింది. నేను వచ్చి నాలుగు జాడించి పోయాను. అదుగో! అప్పటి నుంచి ఇంటి మొగం చూడటం లేదు."

సీతయ్య మాట్లాడే ఒక్కొక్క మాటా ఒక్కొక్క తుపాకీ గుండులా గుండెలకి తగిలింది.

విలాసంగా పడవలో షికారు చేస్తున్న వాడిని ఎవరో నదిలోకి నెట్టగా సుడి గుండంలో పడి గిర గిరా తిరుగుతున్నట్లు వుక్కిరి, బిక్కిరై పోయాడు.

"ఇక నువ్వే ఈ ఇంటికి దిక్కు. మీ నాన్న ఆట కట్టించకపోతే చిల్లిగవ్వ దక్కనివ్వడు. దిగులులో మీ అమ్మ ఎక్కువ రోజులు బ్రతకదు."



"సార్! ఒక్కసారి ఫోను కావాలి? ఇస్తారా?" పక్కింటతను సారధిని అడిగిన ప్రశ్న ఇది.

"విత్ ప్లెజర్!" జవాబిచ్చాడు సారధి.

మర్నాడు—

"సార్ - ఒక్కసారి ఫోను అవసరముంది!"

"ష్యూర్." సారధి జవాబు.

ఆ మర్నాడు—

"సార్ ఫోన్ చేయాలి ..."

"తీసుకోండి."

రెండ్రోజుల తర్వాత—

"ఏమండీ ఫోను తీసుకుంటా!"

"సరే ...తీసుకోండి."

ఆ మర్నాడు—

"ఏమండీ ఫోన్ చేయాలి."

"విత్ ప్లెజర్!" సారధి జవాబు.

"తాళం వేసుందండీ!"

"అయ్యో-ఆవిడ బజారుకు వెళుతూ వెంటబెట్టుకొని వెళ్ళిపోయిందే."

—పినిశెట్టి శ్రీనివాస్

సీతయ్య తలెత్తి వ్యధిత కంఠంతో అంటూవుంటే అనిల్ గుండెల్ని పిండి నట్లు బాధ పడ్డాడు.

'చెప్పు మావయ్యా! ఏం చేయాలి నేను అమ్మకోసం ఏమైనా చేస్తాను ' బాధతో, ఆవేశంగా అన్నాడు అనిల్.

*　　*　　*

ఆరాత్రి—

అన్నపూర్ణ పడుకుందేగాని ఆమెకు అవ్యక్తమైన ఆందోళనతో, ఆవేదనతో నిద్రపట్టడంలేదు.

ఇంతలో తలుపు కొట్టినచప్పుడయింది.

ఆమె గడియ తీసింది.

అతను శివరావు.

కందగడ్డలా ఎర్రబడివున్నాయి కళ్ళు. తాగినమత్తులో తూలుతున్నాడు. కోపంతో అతని ముఖం మండిపోతోంది.

ఆమె ఏ రాక్షసుడో తరుముకు వస్తున్నదానిలా లోపలికి వెళ్ళిపోయింది.

శివరావు ఆమెను అనుసరిస్తూ "నీ కొడుకు ఏం చేశాడో తెలుసా?" కోపంతో ఒక్కొక్కమాటే అన్నాడు.

"తెలుసు!" బాణంలా సూటిగావచ్చింది సమాధానం.

"ఇదంతా నీ అన్నచేసిన కుట్ర. వాడే దగ్గరుండి చేయించాడు."

"అవును."

"అయితే నీకూ తెలుసన్నమాట. నువ్వూ నామీద కత్తిగట్టావన్నమాట. మొగుడిన్న గౌరవం లేదేనీకు. పసివాడిని నామీదకు వుసిగొల్పుతావా. నా మిల్లు, నాడబ్బు. నా ఇష్టం .." తడబడుతూ మత్తులో అంటున్నాడు.

అవమానం, ఆవేశం, కోపంతో వుక్కిరిబిక్కిరై పోయాడు శివరావు.

అతన్ని చూస్తుంటే ఆమెకు భయం కలగటంలేదు. జుగుప్స కలిగింది.

'ఇంకెంతకాలం చూస్తూ వూరుకుంటారు ఎవరైనా? ఇప్పటికే అంతా నాశనమైపోయింది."

క్షణంసేపు ఆమె చూపుల్లోని మంటల్ని చూసి తడబడ్డాడు.

తర్వాత విజృంభించాడు.

"ఏమిటీ నేను నాశనం చేసింది? నా సుఖం కోసం కొంచెం తాగుతున్నాను. నా ఆనందంకోసం ఒక ఆడమనిషిని పోషిస్తున్నాను. అది తప్పా? ఈ లోకంలో ఎందరు ఆ పని చెయ్యడం లేదు. అదొక నేరంకింద జమకట్టి నా పరువు బజారు పాలుచేస్తారా? నువ్వూ నీ అన్న కలిసి నా కొడుకునే నా మీదకు పంపిస్తారా? ...ఛీ..." ఆమె చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు.

"హుఁ-పరువు. అది ఇన్నాళ్ళూ నిలిచివుందా. ఎప్పుడో మంటగలిసింది ఇప్పటివరకూ జరిగింది చాలు." మిల్లు వ్యవహారాలు, పొలం పనులు మాత్రం రేపటినుంచి అబ్బాయే చూసుకుంటాడు ఆమె విసురుగా అతని చేతిని తీసి విసిరి కొట్టింది.

"అన్నపూర్ణా! " తుపాకీ గుండు దెబ్బతిన్న మనిషిలా అన్నాడు.

"అవును. అన్నపూర్ణనే."

ఆత్మ విశ్వాసంతో వుట్టిపడుతున్న అన్నపూర్ణ ముందు అల్పత్వంతో క్రుంగిపోయాడు శివరావు.

గతించిన జీవితం కళ్ళముందు మసక మసకగా కదిలిపోతోంది.

శివరావుకి అంతా అయోమయంగా వుంది.ఎందుకో తనమీద తనకే అసహ్యం కలిగింది. 'తన భార్య తనని ఎదిరించి

మాట్లాడుతోంది. తన కొడుకు తనను లెక్క చెయ్యకుండా మిల్లు స్వాధీనం చేసుకున్నాడు. తన బావమరిది తనను నీచంగా చూస్తున్నాడు. ఛీ.. ఛీ... వీళ్ళంతా తనపాలిట శత్రువులు. తన సుఖాన్ని, తన ఆనందాన్ని చూసి ఏడ్చి ఛస్తున్నారు.'

దెయ్యం పట్టిన వాడిలా వూగిపోతూ శివరావు ఆమె జుట్టు పట్టుకుని వంగదీసి నాలుగు గుద్దులు గుద్దాడు.

అన్నపూర్ణ ఏడుస్తూ ఒక మూలకుపడి పోయింది. కాలితో బలంకొద్దీ తన్నాడు.

ఆమె చేతి గాజులు గల గలా శబ్దం చేస్తూ రాలిపోయాయి. కుంకుమ చెదిరి పోయి ముఖమంతా ఎర్రగా అలుముకు పోయింది.

"నాన్నా! " అంటూ వచ్చి అనిల్ తండ్రికి అడ్డం వెళ్ళాడు.

సీతయ్య గుమ్మంలో నిల్చున్నాడు. అతని కళ్ళల్లోనుంచి మంటలు కురిశాయి.

శివరావు గూడా సీతయ్యని కోపంగా చూశాడు.

చూపులతోనే మాడ్చి, మసి చేసుకునేంత తీవ్రంగా ఒకరి నొకరు చూసుకున్నారు.

"ఛీ... నీ బతుకు బండలుగాను. ఆడదానిమీద చెయ్యి చేసుకుంటున్నావా? దాని మొఖం చూసి వూరుకుంటున్నాను గాని లేకపోతే నీ నెత్తురు కళ్ళజూచి వుండే వాడిని." పట, పట పళ్ళు కొరుకుతూ అన్నాడు సీతయ్య.

ఏడిశావ్‌లే నోర్ముయ్ ఇక్కడెవరూ గాజులు తొడిగించుకుని లేరు అసలు నీ అలుసు చూసుకుని గదూ ఇది ఇంతకు తెగించింది. సిగ్గులేకపోతేసరి. నా సంసారంలో నువ్వెందుకు తలదూర్చడం." అన్నాడు శివరావు, సీతయ్యమీద మండి పడుతూ.

శివరావు, సీతయ్య ప్రత్యర్థుల్లాగా ఎదురెదురుగా నిలబడి వురిమి, వురిమి చూసుకుంటున్నారు ఇద్దరిమధ్యా అనిల్ వున్నాడు వాడికి భయం వేసింది ఇద్దరూ కొట్టుకుంటారేమోనని




సారధి ఇంట్లోకి అడుగు పెడుతూ
"డాళింగ్ రాధా! కమాన్ - ఏమేం కాయగూరలు తెచ్చానో చూడు."

పదేళ్ళ తర్వాత!

"రాధా! ఈ కాయగూరలు సంచి అందుకుంటావూ!"

మరో పదేళ్ళ తర్వాత!!

"ఒసేవ్-ఈ కూరల సంచి తీస్కో."

మరో పదేళ్ళు గడిచిన తర్వాత!!!

"ఒసేవ్ - వంటగదిలో ఎక్కడ తగలడ్డావే-ఈ కూరల సంచి కాస్త తీసుకొని ఏడువ్!''

—పినిశెట్టి శ్రీనివాస్

"నువ్వారుకో మావయ్యా!...."
అంటూ సీతయ్య చేతిని పట్టుకుని లోపలకు తీసుకెళ్ళాడు అనిల్.

శివరావు కోపంతో బుసలు కొడుతూ పడక గదిలోకి వెళ్ళి పందిరి మంచం ఎక్కి పడుకున్నాడు.

అన్నపూర్ణ ఏడుపూ, వెక్కిళ్ళూ విని ఎస్తున్నాయి.

*　　*　　*

అర్ధరాత్రి శివరావుకి మెలకువ వచ్చింది.

చుట్టూ చీకటిగా వుంది.

మధలీ హాలులో కిరసనాయిలు బుడ్డి మినుకు, మినుకుమంటూ వెలుగుతోంది.

అందరూ గాఢ నిద్రలో వున్నారు.

శివరావుకి దాహం వేసింది. వంట గదిలోకి వెళ్ళి మంచినీళ్ళు తాగివచ్చి పడుకున్నాడు. కళ్ళు మూసుకున్నాడు కాని నిద్ర పట్టడంలేదు.

ఆలోచనలు ముసురుకున్నాయి.

ఎంత పని జరిగింది? ఇలా జరుగుతుందని తను కలలోగూడా వూహించలేదు.

తన పరువు మంట గలిసిపోయింది గదా! రేపటినుంచి తనను ఎవరు లెక్క చేస్తారు! వూరినిండా అప్పులు. పొలం అన్నపూర్ణ పేరవుంద. మిల్లు కొడుకు స్వయంగా చూసుకుంటాడు. ఈ విషయం వూరంతా తెలిసిపోయింది. అప్పులవాళ్లు ఇక ఒత్తిడిచేస్తారు. అప్పులు తీర్చేదెలా? అసలు రోజులు గడిచేది ఎలా? మీనాక్షిని పోషించేది ఎలా? ఛీ....పాడు జన్మ వున్నట్లుండి ఇలా జరిగిందేమిటి ఇదంతా ఆ సీతయ్యగాడి పన్నాగం దొంగముండాకొడుకు. తనపాలిట శనిలా దాపురించాడు. ఇప్పుడేం చెయ్యాలి?

శివరావు తీవ్రంగా ఆలోచిస్తూ పడుకున్నాడు.

*　　*　　*

సీతయ్య, అనిల్ ఇంకా నిద్ర లేవనేలేదు.

అన్నపూర్ణ లేచి కసువు వూడ్చి కళ్ళాపిజల్లి గదిలోకి వెళ్ళింది. ముగ్గుబుట్ట తెస్తూ పడక గదిలోకి తొంగిచూస్తే శివరావు లేడు.

ఏ అర్ధరాత్రి లేచి వెళ్ళిపోయాడో అనుకుని దీర్ఘంగా నిట్టూర్చింది.

ఆమెకు ఏదో అనుమానం వచ్చి చూసుకుంటే బొడ్లో దోపుకున్న తాళాల గుత్తి లేదు.

బీరువాకి వ్రేలాడుతూ కన్పించాయి

తెరిచి చూసేసరికి ఇంకేముంది, నగలు మాయమైపోయాయి. వడ్డాణం, కసుంపేరు, రెండు పేటల చంద్రహారం నాగరం, నాలుగు జతల గాజులు ...

అన్నపూర్ణ పెద్దగా రోదిస్తూ అక్కడే కూలబడిపోయింది.

ఆమె ఏడుపువిని సీతయ్య, అనిల్ నిద్రలేచి కంగారుగా వచ్చారు.

నగలుపోయిన సంగతి తెలుసుకుని సీతయ్య నిద్ర కళ్ళతోనే వురుకులు పరుగులతో మీనాక్షి ఇంటికి వెళ్ళాడు.

కాని ఆ ఇంటికి తాళం పెట్టివుంది

*　　*　　*

కాల గర్భంలో పదిహేను సంవత్సరాలు లీనమైపోయాయి___

ఆ రోజు___

శివరావు రైలు దిగాడు

మద్య నిషేధం వస్తే...




ఊరు స్టేషన్‌కి రెండుమైళ్ళ దూరంలో వుంది.

చంద్రుడు లేని ఆకాశం వెండి జరీ చీరలా తళ, తళ లాడుతోంది.

మెల్లగా, మృదువుగా పైరుగాలి తాకింది.

శివరావు నెమ్మదిగా అడుగులువేశాడు.

రోడ్డు ప్రక్కన చెట్లగుబురులు మనుషుల గుంపుల్లా నిలబడి అతన్ని పరిహసిస్తున్నట్లుగా తోచింది.

ఆకాశంలోని నక్షత్రాలు శివరావుకేసి వురిమి, వురిమి చూస్తున్నట్లుగా అనిపించింది.

అతన్ని దాటుకుని కొందరు ముందుకు వెళ్ళిపోయారు.

కొందరు అతనికి తెలిసినవారే, శివరావు వాళ్ళని పలకరించలేదు. వాళ్ళు శివరావుని చూపి గుర్తించలేదు.

శివరావు ఇప్పుడు గుర్తించలేనంతగా మారిపోయాడు చిక్కి శల్యమయ్యాడు కనుగుడ్లు లోపలికి పీక్కుపోయి కళ్ళ క్రింద ఎముకలు ముందుకు తోసుకొచ్చాయి. మొఖంలో ఏమాత్రం కళా కాంతులు లేవు.

స్టేషన్ దూరమైంది.

ఇప్పుడు జీవితం చివరిదశలో వున్నాడు శివరావు.

పాత కోరికలన్నీ చచ్చిపోయాయి.

కొత్త కోరిక ఒకటి మొలకెత్తింది.

చివరిరోజుల్లో కొడుకు దగ్గిర గడిపి, వాడి చేతిలో ప్రాణాలు వదలాలి. అని అతని కోరిక.

నడి సముద్రంలో వదిలి వెళ్ళిపోయినందుకు కొడుకు తనను ఆదరిస్తాడా లేదా? అనే అనుమానం అతనికిలేదు. తప్పకుండా చేరదీస్తాడనే నమ్మకంవుంది. వాడు బుద్ధిమంతుడు, గుణవంతుడు.

అన్నపూర్ణ ఎలావుందో? దానికేం? తను లేడనే బాధతప్ప కొదవేముంది? ధర్మరాజులాంటి కొడుకు. అన్నకూతురే

కోడలు పిల్లా పాపలతో కాలక్షేపం చేస్తూ సుఖంగానే కాలం గడుపుతూ వుంటుంది

ఇన్నేళ్ళ తర్వాత వచ్చిన తనను చూసి ఎంత ఆశ్చర్యపోతుందో? భార్య మీద ఎప్పుడో చచ్చిపోయిన ప్రేమాభిమానాలు ఒక్కసారిగా జీవం పోసుకున్నాయి.

ఎక్కడో నక్కవూళ వేస్తోంది.

కీచురాళ్ళు రొదపెడుతున్నాయి.

ఊరు దగ్గిర పడింది.

నెమ్మదిగా ఇల్లు చేరాడు.

ఇంట్లో లైట్లు వెలుగుతున్నాయి.

శివరావు ఆగిపోయాడు.

"ఇంత రాత్రిపూట రాకపోతేనేం! ఇప్పటికి కదలనిచ్చింది కాబోలు ఆ మహాతల్లి." మొగుడిమీద కేకలు వేస్తోంది సుబ్బలక్ష్మి.

"నోర్ముయ్యవే. వస్తే వచ్చానని ఏడుస్తావ్. రాకపోతే రాలేదని ఏడుస్తావ్. నీ కోసం రాలేదులే. పిల్లలకోసం వచ్చాను." తడబడుతున్న మాటలతో మత్తుగా అంటున్నాడు అనిల్.

"ఆఁ పిల్లలమీద ప్రేమ కారిపోతోంది. పిల్లలట. పిల్లలు ఎవరైనా వింటే మొఖాన వుమ్మివేస్తారు." సుబ్బలక్ష్మి రెచ్చిపోయింది.

వూరికే పేలకు, చంపేస్తాను."

"చంపేసెయ్ నన్నూ ఎల్లల్నీ గూడా పీకపిసికి చంపు పీడ విరగడైపోతుంది అయ్య దేశాలు పట్టిపోయాడు ఇక కొడుకేమో పెళ్ళాం పిల్లల్నిచంపి జైలుకు పోతాడు. అసలు మీ వంశమే ముదనష్టపువంశం. మానాన్న పిచ్చివాడై నన్నిచ్చి పెళ్ళిచేసి నా గొంతుకోసి చచ్చాడు." సుబ్బలక్ష్మి గట్టిగా కేకలు వేసింది.

"ఏమిటే లం ...! కూస్తున్నావ్!"

అనిల్ ఆమె జుట్టుపట్టుకుని వంగదీసి గుద్దుతున్నాడు.

సుబ్బలక్ష్మి పెద్దగా ఏడుస్తోంది.

అన్నపూర్ణవచ్చి "ఎందుకురా దాన్నలా చంపుతున్నావ్ ఛీ .. ఛీ . .ఇది కొంప కాదు. నరకమైపోయింది. లోకంలో ఇంతమంది చస్తున్నారుగాని నాకు చాలు రావడంలేదు. ఆపోయినవాడు నా నగవు తీసుకుపొయ్యాడు. గాని పీకపిసికిగూడా పోతే బాగుండేది...."అని విసుక్కుంటూ కోడల్ని లోపలికి తీసుకెళ్ళింది.

శివరావు కాళ్ళు ముందుకు పడలేదు.

శరీరం బరువెక్కిపోయింది.

ఒక్కొక్క అడుగే వేసుకుంటూ రైలు స్టేషన్ వైపుకు దారితీశాడు.

అతని చుట్టూ నల్లటి చీకటి.

ఆ చీకట్లో అతను మునిగిపోయినట్లుగా కన్పించకుండా కరిగిపోయాడు.□

ఎంత తక్కువైనా అది ఎక్కువే
మీ శక్తిమేరకు తుపాను బాధితులకు
సాయపడండి